
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం । 23 । అక్టోబర్ । 2024



18,947 క్యూసెక్కుల వరద

సోమశిల: జలాశయానికి మంగళవారం 18,947 క్యూసెక్కుల వరద వస్తోంది. జలాశయం 60.594 టీఎంసీలకు చేరుకుంది. దిగువ కాలువలకు 355, కండలేరుకు 10 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.80.490
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.7,290
3 శాతం జీఎస్టీతో	రూ.7,509
నవర (8 గ్రా)	రూ.60,072

గరిష్ఠం/కనిష్ఠం
34.1 /26.9

వాతావరణం

జిల్లాలో బుధవారం వాతావరణం పొడిగా ఉంటుంది. అక్కడక్కడ ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. మంగళవారం గాలిలో తేమ 72 శాతం ఉంది.

న్యూస్‌రీల్

పనులు వేగవంతం చేయండి

• జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు (పొగతోట): జిల్లా వ్యాప్తంగా వివిధ గ్రాంట్ల కింద చేపడుతున్న పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం జెడ్పీ కార్యాలయంలో పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పనుల్లో నాణ్యత లోపించకుండా అధికారులు నిత్యం పర్యవేక్షించాలన్నారు. నాణ్యత లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు

మద్యం షాపు తొలగించాలని ఆందోళన



మద్యం షాపు వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు

నెల్లూరు (క్రైమ్): తమ ప్రాంతంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తూ నగరంలోని మైపాడుగేట్ శ్రీనివాసనగర్ వాసులు చేపట్టిన ఆందోళన మంగళవారం కూడా కొనసాగింది. స్థానికులు మాట్లాడుతూ నివాసాల మధ్య మద్యం షాపు ఏర్పాటు చేయడంతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. అధికారులు స్పందించి షాపును ఇక్కడ నుంచి తొలగించాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని, పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

ఇక్కడొద్దని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు విన్నవిస్తున్న శ్రీనివాసనగర్ వాసులు

నెల్లూరు(దర్గామిట్ట): నగరంలోని మైపాడు గేటు శ్రీనివాసనగర్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని అక్కడి నుంచి తొలగించాలంటూ స్థానికులు కలెక్టర్‌కు ఆనంద్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం పెద్ద సంఖ్యలో కలెక్టరేట్‌కు వచ్చిన స్థానికులు మద్యం షాపుతో తాము పడే ఇబ్బందులను వివరించారు. షాపును మరో ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేస్తున్నా.. ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

కోర్టు నిర్వహణకు భవనాల పరిశీలన



భవనాలు పరిశీలిస్తున్న జిల్లా జడ్జి యామిని

కోవూరు: కోవూరులోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాన్ని జిల్లా జడ్జి యామిని మంగళవారం పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకున్న కోర్టు భవనంలో కార్యకలాపాలు నిర్వహించడం కష్టతరంగా ఉందని, మరొక భవనంలోకి తరలించడంతో పాటు నూతన భవనాన్ని నిర్మించాలని న్యాయమూర్తి చైతన్య జిల్లా జడ్జికి ప్రతిపాదించారు. అందులో భాగంగా జిల్లా జడ్జి కోవూరులోని కోర్టు భవనంతో పాటు తాత్కాలికంగా కోర్టు విధులు నిర్వర్తించేందుకు వీలుగా ఉండే భవనాలను పరిశీలించారు. ఇందిరా క్రాంతిపథం, స్త్రీ,శిశు సంక్షేమ కార్యాలయం, కేఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల భవనాల్ని పరిశీలించారు. ఆమె వెంట న్యాయమూర్తులు చైతన్య, కాత్యాయని, శివనమ్రత, నెల్లూరు ఆర్డీఓ నాగసంతోష్ అనూష, కోవూరు తహసీల్దార్ నిర్మలాందబాబు, ఆర్‌ఐ రాకేశ్, కోర్టు సిబ్బంది తదితరులు ఉన్నారు.

సూపర్ కాప్.. తమ్ముళ్ల కాపు



పొదలకూరురోడ్డులోని మద్యం దుకాణం బయట బహిరంగ మద్య సేవనం చేస్తున్న మందుబాబులు

ఎక్సైజ్ శాఖ.. నిన్నటి వరకు సూపర్ కాప్. ఇప్పుడు తమ్ముళ్లకు కాపు కాస్తుంది. కూటమి ప్రభుత్వం ప్రైవేట్ మద్యం షాపులు తీసుకువచ్చింది. అక్రమ మార్గాలు, సామ దాన దండోపాయాలతో దుకాణాలను చేజిక్కించుకున్న తమ్ముళ్లు.. వాటి నిర్వహణలో ఎక్సైజ్ శాఖ నిబంధనలకు నీళ్లొదిలేశారు. అనుమతులతో తమకు పనిలేదన్నట్లుగా ప్రతి దుకాణానికి అనుబంధంగా సిట్టింగ్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ఎమ్మార్పీ ధరలతో మద్యం అమ్మకాలకు మంగళం పలికారు. పచ్చనేతల వికారపు చేష్టలను ఎక్సైజ్ అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు.



పచ్చనేతల చేతిలో ఎక్సైజ్ కీలుబొమ్మ

- ఆ శాఖ నిబంధనలకు తూట్లు
- ఎమ్మార్పీకి మంగళం
- సిట్టింగ్ రూమ్‌లు ఏర్పాటు
- చేష్టలుడిగి చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

నెల్లూరు (క్రైమ్): జిల్లాలో ఎక్సైజ్ శాఖ డమ్మీగా మారిపోయింది. టీడీపీ నేతలు అక్రమాలకు, దోపిడీకి, చట్టవిరుద్ధ చర్యలకు మాత్రం కాపు కాస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పచ్చనేతలు చెప్పిందే.. చేసేవే నిబంధనలు అన్నట్లుగా మారిపోయాయి. కూటమి ప్రభుత్వం తెచ్చిన ప్రైవేట్ మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ నిబంధనలకు నీళ్లొదిలేశారు. విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేస్తున్నారు. ఎంఆర్‌పీకి మంగళం పాడడంతో



కరెంట్ ఆఫీసు సెంటర్‌లోని మద్యం దుకాణం పైపోర్షన్‌లో సిట్టింగ్ రూమ్

పాటుగా దుకాణాలకు అనుబంధంగా సిట్టింగ్ రూమ్‌లు ఏర్పాటు చేసి పూటుగా మద్యం తాగిస్తున్నారు. కొన్ని చోట్ల దుకాణాల వద్ద బహిరంగంగా మద్య సేవనం చేయిస్తున్నారు. అక్రమాలను కట్టడి చేయాల్సిన ఎక్సైజ్ శాఖ కనీస చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. జిల్లాలో 182 ప్రైవేట్ మద్యం దుకాణాల ఏర్పాటుకు అనుమతులు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు 177 దుకాణాల్లో మద్యం అమ్మకాలు ప్రారంభమయ్యాయి. దుకాణాలను ఏర్పాటు చేసిన నాటి నుంచే అధిక శాతం మంది వ్యాపారులు నిబంధనలకు తూట్లు పొడిచి ఎమ్మార్పీ ధరపై అదనంగా రూ.10 నుంచి రూ.15 వరకు వసూలు చేస్తున్నారు. గతంలో ప్రతి దుకాణం వద్ద ఎక్సైజ్ అధికారుల ఫోన్ నంబర్లు అందుబాటులో ఉండేవి. దీంతో నిబంధనల అతిక్రమణపై మద్యం ప్రియులు సదరు నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా పోయింది.

యథేచ్ఛగా సిట్టింగ్ రూమ్‌లు

నూతన మద్యం పాలసీ నిబంధనల మేరకు సిట్టింగ్ రూమ్‌లకు అనుమతులు లేవు. దుకాణంలో మద్యం కొనుగోలు చేసి తమ వెంట తీసుకెళ్లాలే తప్ప అక్కడ తాగడానికి వీల్లేదు. ఇలా అయితే వ్యాపారం సాగదని భావించిన వ్యాపారులు నిబంధనలను తోసి రాజేసి సిట్టింగ్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే నెల్లూరు నగరంలోని అనేక దుకాణాలకు పక్కనే సిట్టింగ్ రూమ్ లు వెలిశాయి. మద్యం ప్రియులు దుకాణాల్లో మద్యం కొనుగోలు చేసి పక్కనే ఉన్న సిట్టింగ్ రూమ్‌ల్లో ఎంచక్కా మద్య సేవనం చేస్తున్నారు. మరి కొన్ని ప్రాంతాల్లో దుకాణాల బయటే బహిరంగ మద్య సేవనం చేస్తున్నారు. దీంతో అటు వైపుగా రాకపోకలు సాగించే ప్రజలు, ప్రధానంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఎక్సైజ్ గప్‌చుప్

నిబంధనలను వ్యాపారులు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నా.. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడం వెనుక అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు, వ్యాపారులతో కుదుర్చుకున్న లోపాయికారి ఒప్పందాలే కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో అక్రమ వ్యాపారం మూడు బీర్లు.. ఆరు క్వార్టర్లు చందంగా జోరుగా సాగుతోంది. ఈ విషయమై ఎక్సైజ్ అధికారులను వివరణ కోరగా నిబంధనలు పక్కాగా అమ లు చేస్తున్నామ న్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని చెప్పారు.



డైకస్‌రోడ్డులోని మద్యం దుకాణం పక్కనే సిట్టింగ్ రూమ్

డిగ్రీ పరీక్షల్లో విద్యార్థి డిబార్

వెంకటాచలం: విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మంగళవారం నిర్వహించిన మూడో సెమిస్టర్ పరీక్షల్లో ఒక విద్యార్థి డిబార్ అయ్యాడు. మొత్తం 9,960 మంది విద్యార్థులకు 9,269 మంది హాజరు కాగా, 691 మంది గైర్హాజరయ్యారు. నాయుడుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి డిబార్ అయినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు.

అద్దె బస్సుల యాజమాన్యాలు జాగ్రత్తలు తీసుకోవాలి

నెల్లూరు సిటీ: గ్రామీణ ప్రాంతాల్లో తిరిగే అద్దె బస్సుల యాజమాన్యాలు ప్రయాణికుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్టీసీ జోనల్ ఈడీ వెంకటేశ్వరరావు తెలిపారు. కాకుటూరులోని జోనల్ శిక్షణా కళాశాలలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు అద్దె బస్సుల నిర్వాహకులు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి మురళీబాబు, డిప్యూటీ సీటీఎం షమీమ్, కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

25న ఉదయగిరిలో జాబ్‌మేళా

ఉదయగిరి: స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీసు, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఆకుల నరసింహులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, డెక్కన్ వీల్స్ కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తారన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా చదివిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విత్తనాలు, ఎరువులు సిద్ధం చేయండి

• కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (దర్గామిట్ట): రబీ వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు అవసరమైన మేరకు ఎరువులు, విత్తనాలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఓ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో వ్యవసాయ అనుబంధశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతుల భూములకు సంబంధించి మట్టి నమూనా పరీక్షలు చేపట్టాలని సూచించారు. పండించే పంటలకు సంబంధించి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇతర కంపెనీలతో అనుసంధానం చేసుకుని వారికి చేరువ చేయాలని చెప్పారు. జిల్లాలో ప్రస్తుతం ఇచ్చిన లక్ష్యాల మేరకు రైతుల భూములకు సంబంధించి ఈ క్రాప్ నమోదు చేయాలని ఆదేశించారు. ప్రధానమంత్రి కిసాన్ పథకం కింద రైతులను రిజిస్ట్రేషన్ చేసి వారికి అవసరమైన ఇన్‌పుట్ సబ్సిడీని పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అర్హత కలిగిన రైతులందరికీ క్రాప్ కల్టివేషన్ గుర్తింపు కార్డులను మంజూరు చేయాలని ఆదేశించారు. ఉద్యాన పంటలు ప్రోత్సహించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.



వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాల మేరకు ఉద్యాన పంటలు సాగు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఉద్యాన పంటలను నిల్వ చేసుకోవడానికి కలెక్షన్ సెంటర్లను, రైపనింగ్ సెంటర్లను మంజూరు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం మేరకు పశువుల షెడ్లను మంజూరు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి, పశు సంవర్ధకశాఖ అధికారి రమేష్‌నాయక్, జిల్లా ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి, జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి అనిత తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎన్‌జే డిస్టిలరీస్‌లో సీఐడీ తనిఖీలు

వెంకటాచలం: మండలంలోని సర్వేపల్లి సమీపంలో ఉన్న ఎస్‌ఎన్‌జే డిస్టిలరీస్‌లో మంగళవారం సీఐడీ బృందం విస్తృతంగా తనిఖీలు చేపట్టింది. సీఐడీ డీఎస్పీ కోటారెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ, ఎక్సైజ్, పోలీస్‌శాఖ అధికారులు ఉదయం 10 గంటలకు ఎస్ఎన్‌జే డిస్టిలరీస్‌కు చేరుకుని పలు రికార్డులను తనిఖీలు చేశారు. కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలు సాయంత్రం వరకు కొనసాగాయి.



ఎస్‌ఎన్‌జే డిస్టిలరీస్‌లో తనిఖీలు చేస్తున్న సీఐడీ బృందం

భూసేకరణ త్వరితగతిన చేపట్టాలి

• జాయింట్ కలెక్టర్ కార్తీక్

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లాలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల భూసేకరణ విషయంలో త్వరితగతిన చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల కింద భూసేకరణకు సంబంధించి జేసీ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఎన్‌హెచ్ఏఐ, రైల్వే ఆర్‌ఓబీలు, ఆర్అండ్‌బీ రోడ్లు, ఏపీఐఐసీ, మెగా ఇండస్ట్రియల్ హబ్ తదితర ప్రాజెక్టులకు అవసరమైన భూమి సేకరణ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా అవార్డు చేసిన భూములకు సంబంధించి పోజిషన్ పూర్తయి, చెల్లింపులు జరగని వారి విషయంలో ఎన్‌హెచ్ యాక్ట్‌లోని సెక్షన్ 3లోని నిబంధనల ప్రకారం వారికి నోటీసులు అందజేసి, ఆయా మొత్తాలను సివిల్ కోర్టులో డిపాజిట్ చేయాలన్నారు. ఇతర ప్రాజెక్టుల విషయంలో ఎల్ఏ యాక్ట్ ప్రకారం సంబంధిత అథారిటీ ట్రిబ్యునల్‌లో డిపాజిట్ చేయాలన్నారు. జిల్లాలో రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి కొన్ని చోట్ల మ్యుటేషన్స్ పెండింగ్‌లో ఉన్నట్లుగా గుర్తించామన్నారు. అవార్డు అయ్యాక, చెల్లింపులు చేసిన తర్వాత మ్యుటేషన్స్ పెండింగ్‌లో ఉన్నట్లుగా గుర్తించామన్నారు. మ్యుటేషన్స్ పూర్తి చేస్తేనే ఆయా భూములను సంబంధిత ప్రాజెక్ట్ వారికి పూర్తిస్థాయిలో అందజేసినట్లు అవుతుందన్నారు. వివిధ ప్రాజెక్టుల భూసేకరణ పనులు పూర్తి చేసి ఆయా ప్రాజెక్టుల పనుల పురోగతి సాధించేందుకు రెవెన్యూ డివిజనల్ అధికారులు కృషి చేయాలన్నారు. ఇందుకు రోజు వారి సమీక్షలు తప్పనిసరి అన్నారు. ఈ సమావేశంలో నెల్లూరు, ఆత్మకూరు ఆర్డీఓలు నాగసంతోష్ అనూష, పావని, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, వివిధ ప్రాజెక్టుల అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

తల్లీబిడ్డ ఆరోగ్య రక్షణకు కృషి

• డీఎంహెచ్ఓ పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): తల్లీ, బిడ్డ ఆరోగ్య సంరక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని డీఎంహెచ్ఓ పెంచలయ్య డాక్టర్లు, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఆగస్టు, సెప్టెంబర్‌లో జిల్లాలో జరిగిన మాతా శిశు మరణాలపై మంగళవారం సంతపేటలోని వైద్యశాఖ కార్యాలయంలో సబ్ కమిటీ సమావేశం జరిగింది. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ గర్భిణిని గుర్తించిన వెంటనే వారి పేరు రిజిస్టర్‌లో నమోదు చేసి అప్పటి నుంచి కాన్పు జరిగే వరకు తగిన రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. బీపీ, షుగర్, ఒబేసిటీ ఉన్నటువంటి హైరిస్క్ కేసులను ముందస్తుగా ఆస్పత్రిలో చేర్పించాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు జరిగితే జేఎస్‌వై, జేఎస్ఎస్‌కే పథకాల కింద ఆ తల్లికి నగదు అందజేయడం జరుగుతుందన్నారు. సుఖ ప్రసవం జరిగే వరకు సంబంధిత ఆరోగ్య పర్యవేక్షకులు పూర్తి బాధ్యత వహించేలా మెడికల్ ఆఫీసర్లు చర్యలు తీసుకోవాలన్నారు. రెండు నెలల్లో జరిగిన 12 మంది శిశు మరణాలు, ఇద్దరు తల్లుల మరణాలకు కారణాలపై విశ్లేషించారు. ఇక మీదట అలా జరగకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పెద్దాస్పత్రి గైనకాలజీ హెచ్ఓడీ డాక్టర్ గీతాలక్ష్మి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయలక్ష్మి, డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరి, చిన్నపిల్లల డాక్టర్ సింధు, డాక్టర్ సంధ్య, ఎఫ్‌పీసీ డాక్టర్ దయాకర్, డీపీఎంఓ డాక్టర్ రమేష్, డెమో అధికారి కనకరత్నం, డీపీహెచ్ఎన్ఓ మంజుల, ఏఎస్ఓ రమేష్, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.



ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ పెంచలయ్య

దిగొచ్చిన టమాటా ధరలు

నెల్లూరు (సెంట్రల్): నెల్లూరులోని మద్రాసు బస్టాండ్ వద్ద ఉన్న హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో టమాటా ధరలు దిగొచ్చాయి. టమాటా కిలో దాదాపు రూ.100కి చేరిందని ఈ నెల 19వ తేదీ 'సాక్షి'లో 'మళ్లీ టమాటా ధరలకు రెక్కలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. టమాటా ధరలు భారీగా పెరగడంతో జిల్లా మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో టమాటాలను తెచ్చి సబ్సిడీ ధరలకు విక్రయించింది. అంతకు ముందు వరకు కిలో రూ.100కు విక్రయించిన వ్యాపారులు ఉన్నపళంగా ధరలు తగ్గించారు. దీంతో అధికారులు సబ్సిడీపై సరఫరా చేసే టమాటాలను నిలిపివేయడంతో మళ్లీ ధరలు పెంచారు. దీనిపై సాక్షిలో కథనం రావడంతో స్పందించిన అధికారులు నిత్యం కూరగాయల మార్కెట్‌లో తనిఖీలు నిర్వహించారు. ప్రస్తుతం టమాటా కిలో రూ.40కే విక్రయిస్తున్నారు.

సాక్షి ఎఫెక్ట్..



ఒక్కసారిగా ధర తగ్గడంలో వినియోగదారులు కూడా ఆశ్చర్యపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలను బూచిగా చూపి ధరలు పెంచుతున్నారని విమర్శలు రావడంతో హోల్‌సేల్ వ్యాపారులు ధరలు తగ్గించినట్లు తెలుస్తోంది. రానున్న రోజుల్లో టమాటా ధర మరింత తగ్గే అవకాశాలు ఉన్నాయి.

సాగునీటి సంఘాల ఓటరు జాబితా సిద్ధం చేయండి

• కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియలో భాగంగా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమష్టిగా కృషి చేసి ఈ నెల 31వ తేదీ నాటికి ఓటరు జాబితా తయారు చేయాలని కలెక్టర్ ఓ ఆనంద్ కోరారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్ నుంచి రెవెన్యూ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, మ్యుటేషన్లు, గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు, ఉపాధి హామీ పనిదినాల పెంపు, హౌసింగ్ మొదలైన అంశాలపై సబ్ కలెక్టర్లు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూలో ఇంటిగ్రేడెట్ సర్టిఫికెట్లు మంజూరు, మ్యుటేషన్ ట్రాన్సాక్షన్లపై తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చేటు వంటి అర్జీలను ఆడిట్ చేసేందుకు 10 మంది అధికారులతో టీమ్‌ను నియమించామన్నారు. ఈ టీమ్ జిల్లా మొత్తంలో వచ్చిన అర్జీలను పరిష్కరించిన విధానం పరిశీలిస్తారని, సరైన కారణం లేకుండా తిరస్కరిస్తే ఆయా అధికారులపై చర్యలు తప్పవన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీల పరిష్కారం ఆధారంగా ఆయా అధికారుల ఏసీఆర్‌లు తయారు చేస్తామన్నారు. గ్రామాల నుంచి వివిధ రకాల సేవలకు అర్జీదారులు నేరుగా కలెక్టరేట్‌కు వస్తున్నారని, వారికి మీసేవ లేదా సచివాలయాల ద్వారా సేవల కోసం దరఖాస్తు చేసుకునే విధంగా వీఆర్ఓలు అవగాహన కల్పించాలన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టినందున హౌసింగ్ స్టేజ్ కన్వర్షన్లపై దృష్టి పెట్టాలని, కంప్లీషన్ దశలో ఉన్న ఇళ్లపై దృష్టి సారించి పూర్తి చేయాలన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకానికి సంబంధించిన పరిశీలన వెంటనే పూర్తి చేసి నివేదికలు పంపాలన్నారు. ఉపాధి హామీ పని దినాలు పెంచాలని, 70 వేల పనిదినాల లక్ష్యాన్ని కచ్చితంగా చేరుకోవాలని, నరేగా పనుల్లో ప్లాంటేషన్ ఫిట్టింగ్, ఫామ్ పాండ్స్ పూర్తి చేసేందుకు మట్టి పనుల్లో లేబర్ కాంపొండ్ పెరిగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీల్లో ప్రతి రోజు క్లోరినేషన్ చేయాలని, ఓహెచ్ ట్యాంకులను శుభ్రపరచాలన్నారు. ఎటువంటి ఆధారాలు లేని ఎస్టీలను గుర్తించి ఇప్పటికే కొన్ని మండలాల్లో బర్త్ సర్టిఫికెట్లు జారీ చేశారని, వెంటనే ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసి వారికి ఆధార్ కార్డులు ఇచ్చే ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు పెండింగ్‌లో ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు పెండింగ్‌లో ఉన్న లైబ్రరీ సెస్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ కె కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, డీఆర్ఓ లవన్న, డీఎంహెచ్ఓ పెంచలయ్య, డీపీఓ శ్రీధర్ రెడ్డి, హౌసింగ్ పీడీ దయాకర్, పరిశ్రమల శాఖ జీఎం మారుతిప్రసాద్ తదితరులు ఉన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (దర్గామిట్ట): మాజీ సైనికుల పిల్లలకు ప్రధాన మంత్రి స్కాలర్‌షిప్ పథకం 2024–25 కేంద్రీయ సైనిక్ బోర్డు న్యూఢిల్లీ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సైనిక వెల్ఫేర్ అధికారి ఎం. పద్మజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఈ, బీటెక్, ఎంబీబీఎస్, బీఈడీ, బీబీఏ, బీసీఏ, బీఫార్మసీ, బీఏ ఎల్ఎల్‌బీ వంటి సాంకేతిక, విద్య కోర్సుల్లో చేరిన వారు ఈ ఉపకార వేతనం పొందేందుకు అర్హులని, ఇంటర్మీడియట్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఈ ఉపకార వేతనం ద్వారా బాలురకు నెలకు రూ.2,500, బాలికలకు రూ.3 వేలు మంజూరు చేస్తారన్నారు. అర్హత ఉన్న అభ్యర్థులు కేంద్రీయ సైనిక్ బోర్డు, న్యూఢిల్లీ వెబ్‌సైట్‌లో నవంబర్ 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

అమ్మవారి మంగళసూత్రం అపహరణ

అల్లూరు: అల్లూరుపేట శివాలయంలోని కామాక్షమ్మ అమ్మవారి బంగారు మంగళ సూత్రం, వెండి కర్ణ పత్రాలను దొంగలు మంగళవారం వేకువజామున అపహరించారు. ఆలయ ఈఓ చిట్టిబాబు తెలిపిన వివరాల మేరకు.. 4 గ్రాముల అమ్మవారి మంగళసూత్రం, 100 గ్రాముల వెండి కర్ణ పత్రాలను అపహరించారని, వాటి విలువ దాదాపు రూ.50 వేలు ఉంటుందన్నారు. అల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అక్రమాలు జరిగినట్లు చెప్పండి

- హౌసింగ్ ఉద్యోగులతో సోమిరెడ్డి


మాట్లాడుతున్న సోమిరెడ్డి

నెల్లూరు(సెంట్రల్): ఇళ్ల నిర్మాణాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని చెప్పాలని హౌసింగ్ అధికారులపై సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి ఒత్తిడి తెచ్చారు. గత ప్రభుత్వంలో రూ.కోట్లలో అవినీతి జరిగిందని ఉద్యోగులు ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో చెప్పాలని ఎమ్మెల్యే సూచించారు. నెల్లూరులోని సోమిరెడ్డి కార్యాలయానికి హౌసింగ్ ఉద్యోగులను మంగళవారం పిలిపించుకున్నారు. ఈ సందర్భంగా రాజకీయ ఉపన్యాసం మాదిరి ఉద్యోగులను ఉద్దేశించి పదేపదే గత ప్రభుత్వంలో అవినీతి జరిగిందని చెప్పాలని, లేకపోతే మీరు ఇబ్బందులు పడతారని చెప్పడం గమనార్హం.

లెనోవో 2వ స్టోర్ ప్రారంభం


లెనోవో స్టోర్ ప్రారంభిస్తున్న కార్తీక్ అయ్యర్, ప్రభాకరన్

నెల్లూరు(బృందావనం): నగరంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద లెనోవో రెండవ స్టోర్‌ను ప్రాంతీయ మేనేజర్ కార్తీక్ అయ్యర్, ప్రాంతీయ చానల్ మేనేజర్ ప్రభాకరన్‌లు మంగళవారం ప్రారంభించారు. లెనోవో స్టోర్‌ను నెల్లూరులో ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని వారు అన్నారు. ఈ సందర్భంగా ఎస్వీ కంప్యూటర్స్ అండ్ గాడ్జెట్స్ బిజినెస్ హెడ్, లెనోవో అధీకృత డైరెక్ట్ పార్టనర్ దీపక్ బొమ్మిశెట్టి మాట్లాడుతూ బెంగళూరు, తిరుపతి, నెల్లూరులలో 15కి పైగా స్టోర్లను విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. తమ నూతన స్టోర్‌లో ఏఐ ఆధారిత ల్యాప్‌టాప్‌లు, డెస్క్‌టాప్‌లు, ట్యాబ్‌లు ప్రత్యేక ఆఫర్లతో ఈ నెల అంతటా అందుబాటులో ఉంటాయన్నారు.

హత్యకేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): ఏసీ కూరగాయల మార్కెట్ వద్ద ఇటీవల హత్యకు గురైన రౌడీషీటర్ వాకా అశోక్ హత్యకేసులో నిందితుడిని చిన్నబజారు పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల సమాచారం మేరకు.. ముత్తుకూరు గేటు సెంటర్ సర్వేపల్లి కాలువకట్టకు చెందిన అశోక్ రౌడీషీటర్ ఈనెల 15న హత్యకు గురైన విషయం తెలిసిందే. సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులు ఉడ్‌హౌస్ సంఘానికి చెందిన సస్పెక్టెడ్ షీటర్లు జి.రాము, పి.సందీప్‌కుమార్‌లుగా గుర్తించారు. పరారీలో ఉన్న నిందితుల్లో ఒకరైన సందీప్‌కుమార్‌ను మంగళవారం బోడిగాడితోట వద్ద అరెస్ట్ చేశారు. నిందితునిపై నవాబుపేట, చిన్నబజారు, సంతపేట, నెల్లూరు రూరల్ పోలీసుస్టేషన్‌లలో కేసులున్నాయని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. హతునితో నిందితులకు ఇదివరకే పరిచయం ఉందని, 15వ తేదీ తెల్లవారుజామున అశోక్‌కు నిందితుల నడుమ మాటామాటా పెరగడంతో, వారు అశోక్‌ను హత్యచేశారని ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు. పరారీలో ఉన్న రామును త్వరలోనే అరెస్ట్‌చేస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 132
లేయర్ (లైవ్)	: 115
బ్రాయిలర్ చికెన్	: 236
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 262
లేయర్ చికెన్	: 195



- పంచాయతీల్లో 15వ ఆర్థిక సంఘం నిధులపై ఎమ్మెల్యేల పేచీ
- సర్పంచ్‌లు చేసిన పనులకు బిల్లులు చెల్లించొద్దంటూ అధికారులకు ఆదేశాలు
- బిల్లులు కావాలంటే ఎమ్మెల్యేతో మాట్లాడుకోవాలంటూ సలహా
- అప్పులు చేసి మరీ గ్రామాల్లో పనులు
- బిల్లులు రాక సర్పంచ్‌ల గగ్గోలు

అధికార పార్టీ ఎమ్మెల్యేల వేధింపులు, సాధింపులు ఆగడం లేదు. 'పల్లె సీమలు దేశానికి పట్టుగొమ్మలు'.. అలాంటి పల్లెసీమలను పాలించే ప్రథమ పౌరులపై అధికార పార్టీ పెత్తనం చెలాయించేందుకు, శాసించేందుకు అడుగులు వేస్తోంది. జిల్లాలో తొంబై శాతం సర్పంచ్‌లు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు కావడంతో వారిని ఆర్థికంగా దెబ్బతీసే కుట్రలకు కూటమి పాలకులు పాల్పడుతున్నారు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సర్పంచ్‌ల హక్కులను కాలరాస్తున్నారు. పంచాయతీల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే పనులకు సంబంధించి బిల్లులు మంజూరు చేయకుండా మోకాలడ్డుతున్నారు.

బిల్లులపై ఆంక్షలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: గ్రామ పంచాయతీల్లో అభివృద్ధికి టీడీపీ ఎమ్మెల్యేలు శాపంగా మారారు. ఆ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చెప్పే మాటలకు, క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యేల చేతలకు పొంతన ఉండడం లేదు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన పంచాయతీలకు మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులతో పనులు చేయాలన్నా.. చేసిన పనులకు నిధులు డ్రా చేయాలన్నా తమ అనుమతి తీసుకోవాలంటూ కూటమి ఎమ్మెల్యేలు ఆంక్షలు విధించారు. దీంతో పంచాయతీల్లో పనులు సాగక.. ఇప్పటికే చేసిన పనులకు బిల్లులు రాక సర్పంచ్‌లు సతమతమవుతున్నారు. జిల్లాలోని గ్రామ పంచాయతీలకు నెల కిందట కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను మంజూరు చేసింది. జిల్లాలో 720 గ్రామ పంచాయతీలకు రూ.34.78 కోట్లు మంజూరయ్యాయి. వీటితో పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేసేందుకు సర్పంచ్‌లు సిద్ధమైనా స్థానిక ఎమ్మెల్యేలు అడ్డుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ మద్దతు సర్పంచ్ ఎవరైనా పనులు చేసినా ఎంబుక్ రికార్డు చేయొద్దని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిచ్చారు. ఆత్మకూరు, కందుకూరు, ఉదయగిరి, కావలి నియోజకవర్గాల్లో ఇప్పటికే స్థానిక ఎంపీడీఓలకు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఆదేశాలివ్వడంతో ఆయా పంచాయతీల్లో అభివృద్ధి పనులకు బ్రేకులు పడ్డాయి. గతంలో చేసిన పనులకు బిల్లులు చేసుకునేందుకు పేచీ పెడుతున్నారు. ఎమ్మెల్యేతో చెప్పించుకుంటేనే బిల్లులు పెడతామని ఎంపీడీఓలు తెగేసి చెబుతున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులకు కూడా మౌఖిక ఆదేశాలివ్వడంతో తాము సంతకాలు చేయబోమని చెబుతుండడంతో సర్పంచ్‌లు ఇదెక్కడి ఖర్మరా 'బాబు' అంటూ తలలు పట్టుకుంటున్నారు.

బిల్లు చేసేందుకు ససేమిరా..

నిజానికి.. క్షేత్రస్థాయిలో గ్రామ పంచాయతీ స్వతంత్ర ప్రతిపత్తిగల స్థానిక సంస్థ. గ్రామాభివృద్ధికి సంబంధించి స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుని అమలు చేసుకునే హక్కు కలిగి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగు పర్చేందుకు సర్పంచ్‌లు ఖర్చు చేశారు. వీరు ప్రధానంగా గ్రామాల్లోని కాల్వల్లో పూడికతీత పనులు, బ్లీచింగ్, ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల క్లీనింగ్, వీధిలైట్ల ఏర్పాటు వంటి పనులు చేస్తుంటారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో గత ప్రభుత్వంలో సర్పంచ్‌లు చేసిన పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించేందుకు అధికారులు ఇప్పుడు ససేమిరా అంటున్నారు. ఎంపీడీఓలు బిల్లులు చెల్లించకపోవడంతో సర్పంచ్‌లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. కందుకూరు నియోజకవర్గానికి చెందిన సర్పంచ్‌లు ఇటీవల సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజను కలిసి బిల్లుల విషయంలో ఎంపీడీఓలు పెడుతున్న ఇబ్బందులను మొర పెట్టుకున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఉలవపాడు: నడిచి వెళుతున్న వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో మృతి చెందాడు. ఈ సంఘటన ఉలవపాడు – రాజుపాళెం మధ్య జేబీ డాబా వద్ద మంగళవారం జరిగింది. కావలి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఒంగోలు నుంచి కావలికి వెళ్తున్న సమయంలో ఉలవపాడు దాటిన వెంటనే నడిచి వెళుతున్న గుర్తు తెలియని వ్యక్తిని ఢీ కొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో 108లో కావలి ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. సుమారు 60 ఏళ్లు ఉంటాయని.. భిక్షాటన చేసే వ్యక్తి అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఆచూకీ తెలిస్తే ఉలవపాడు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలియజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ రహదారి పక్కన వ్యక్తి మృతదేహం



సంగం: వెంగారెడ్డిపాళెం సమీపంలో నెల్లూరు – ముంబయి జాతీయ రహదారి పక్కన ముళ్ల పొదల్లో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని స్థానికులు మంగళవారం గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతునికి సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉంటుందని భావిస్తున్నారు. ఎస్సై రాజేష్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ

- డ్రైవర్ మృతి

కావలి: మండలంలోని సర్వాయపాళెం క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతిచెందాడు. కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ పోలీసుల కథనం మేరకు.. తెలంగాణలోని సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం కరక్కాలగూడెం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ సుందరి శ్రీనివాసరావు (53) విశాఖపట్నం నుంచి చెన్నైకు లారీలో ఐరన్ లోడు తీసుకెళ్తున్నాడు. సర్వాయపాళెం క్రాస్‌రోడ్డు వద్ద ముందుపోతున్న లారీని డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ ఎటువంటి సిగ్నల్స్ లేకుండా ఒక్కసారిగా ఆపేశాడు. దీంతో శ్రీనివాసరావు తన వాహనాన్ని కంట్రోల్ చేసుకోలేక ఆగిన లారీని వెనుక భాగంలో ఢీకొట్టాడు. దీంతో రక్తగాయాలై శ్రీనివాసరావు మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.బాజీబాబు చెప్పారు.

తెల్లరాయి తవ్వకాలకు అనుమతి ఇవ్వొద్దు


ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్న అధికారులు

- అభిప్రాయ సేకరణలో వెల్లడించిన జనం

దుత్తలూరు: మండలంలోని దుత్తలూరు పంచాయతీ మజరా గ్రామమైన లక్ష్మీపురం సమీపంలో సర్వే నంబర్ 144-పీలో 9.910 హెక్టార్ల భూమిలో తెల్లరాయి తవ్వకాలకు అనుమతి ఇవ్వొద్దని ప్రజలు డిమాండ్ చేశారు. వేద మైన్స్ అండ్ మినరల్స్ సంస్థ తవ్వకాలకు దరఖాస్తు చేసుకోగా మంగళవారం కావలి ఆర్డీఓ వంశీకృష్ణ అధ్యక్షతన స్థానికంగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఆయనతో పాటు కాలుష్య నియంత్రణ మండలి ఈఈ అశోక్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ తాము వర్షాధార పంటలు, పాడిపశువులపై ఆధారపడి జీవిస్తున్నామన్నారు. పశువులు, జీవాల మేతకు ఈ కొండ ఆధారమని, తవ్వకాలకు అనుమతి ఇస్తే ఇబ్బందులు పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. క్వారీ తవ్వకాలతో పంటల దిగుబడిపై ప్రభావం చూపడమే కాకుండా వ్యాధులబారిన పడే అవకాశాలున్నాయన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తవ్వకాలకు అనుమతులు ఇవ్వొద్దని విన్నవించారు. స్పందించిన అధికారులు గ్రామస్తుల అభిప్రాయాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో కావలి డీఎస్పీ శ్రీధర్, తహసీల్దార్ నాగరాజు, ఎస్సై ఆదిలక్ష్మి, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం


మృతిచెందిన వెంకట రమణారెడ్డి


మృతిచెందిన వెంకట సుబ్బారెడ్డి

- మోటార్ బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

మనుబోలు: మోటార్ బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. ఈ ఘటన మండల పరిధిలోని బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా కోట మండలం విద్యానగర్‌కు చెందిన సిద్ధారెడ్డి వెంకట రమణారెడ్డి తన స్నేహితుడు పానకా వెంకట సుబ్బారెడ్డితో కలిసి వాహనం కొనుగోలు నిమిత్తం మోటార్ బైక్‌పై నెల్లూరు వెళ్లాడు.

పని ముగించుకుని తిరిగి బైక్‌పై విద్యానగర్‌కి వస్తుండగా గూడూరు నుంచి మనుబోలు మండలం కొలనకుదురు గ్రామానికి వెళుతున్న ఆర్టీసీ బస్సు బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డును దాటే క్రమంలో బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో సిద్ధారెడ్డి వెంకట రమణారెడ్డి(60) అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడ్డ పానకా వెంకట సుబ్బారెడ్డి(64)ని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో గూడూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ మృతి చెందాడు. మనుబోలు ఎస్సై శివరాకేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.70
సన్నవి	రూ.40
పండ్లు	రూ.25

వృద్ధుడి బలవన్మరణం

సంగం: మండలంలోని కొరిమెర్లలో అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడు గడ్డి మందు తాగి వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నిమ్మకాయల రాఘవులు (71) కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్నాడు. మంగళవారం ఉదయం గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆత్మకూరు వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. రాఘవులుకు భార్య బుజ్జమ్మ, పిల్లలు న్నారు.

నా కుమార్తెలకు పొలం రాకుండా చేస్తున్నాడు

- కొడుకుపై పోలీసులకు తల్లి ఫిర్యాదు


కూతుళ్లతో బాధితురాలు వెంకటరత్నమ్మ

విడవలూరు: నా తల్లిదండ్రులు నాకు పసుపు కుంకుమ కింద ఇచ్చిన పొలాన్ని నాకు ఇప్పించాలంటూ కోవూరుకు చెందిన గడ్డం వెంకటరత్నమ్మ విడవలూరు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. అనంతరం స్టేషన్ బయట విలేకర్లతో ఆమె మాట్లాడారు. ఆమె కథనం ప్రకారం.. మండలంలోని దండిగుంట గ్రామంలో ఆమె పేరు మీద నాలుగు ఎకరాల పొలం ఉంది. దీనిని గాదెలదిన్నె గ్రామానికి చెందిన నీలిశెట్టి సురేంద్రకు పది సంవత్సరాల నుండి కౌలుకు ఇస్తున్నారు. భర్త చనిపోయిన తర్వాత బాగోగులు చూసుకొనేవారు ఎవరూ లేకపోవడంతో ఆమె తన కుమార్తెలు వద్ద ఉంటున్నారు. ఈ నాలుగు ఎకరాల పొలాన్ని తన కుమార్తెలు చందోలు సుదర్శనలక్ష్మి, కాంచనకు రిజిస్ట్రేషన్ చేశారు. అయితే కూతుర్లకు రాసిచ్చిన పొలాన్ని వారికి ఇవ్వకుండా కౌలుకు చేసుకుంటున్న నీలిశెట్టి సురేంద్రతో కలసి తన కుమారుడు సుబ్బారావు అడ్డుపడుతున్నారని ఆమె ఆరోపించారు. పొలంలో ఎవరైనా అడుగు పెడితే చంపేస్తామని బెదిరిస్తున్నారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కేంద్ర పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): కేంద్ర ప్రభుత్వం పేదల భద్రత కోసం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లాస్థాయి బ్యాంకర్ల సమితి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని బ్యాంకుల పరిధిలో ఖాతాదారులకు ఈ పథకాలు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వార్డు, గ్రామ సచివాలయ సిబ్బంది ఈ సమాచారాన్ని అందరికీ తెలియజేయాలన్నారు. మెప్మా పీడీ, జిల్లా పంచాయతీ అధికారి ఈ కార్యక్రమాలను పర్యవేక్షించాలన్నారు. లీడ్ డిస్ట్రిక్ బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్ష బీమాకు సంవత్సరానికి రూ.20 చెల్లిస్తే రూ.2లక్షల ప్రమాదబీమా, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమాకు సంవత్సరానికి రూ.436 చెల్లిస్తే 18 ఏళ్ల నుంచి 50 ఏళ్లలోపు ఎటువంటి మరణం సంభవించినా రూ.2లక్షలు కేంద్ర ప్రభుత్వం ఆ కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, మెప్మా పీడీ రవీంద్ర, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సై

- తొమ్మిదేళ్ల తర్వాత ఎన్నికలు
- ఓటరు జాబితాలో నిమగ్నమైన రెవెన్యూ అధికారులు

ఉదయగిరి: సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం ఎన్నికల సైరన్ మోగించింది. సాగునీటి వనరుల బాగోగులు చూసుకునేందుకు నీటి సంఘాల కమిటీలు ఏర్పడనున్నాయి. తొమ్మిదేళ్ల తర్వాత సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుపుతున్నారు. వచ్చే నెల 21 నుంచి 27 వరకు జరగనున్న ఈ సమరానికి సంబంధించి కలెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లా పరిధిలో 494 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతాయి. వీటిలో 68 మేజర్, 49 మీడియం, 25 ప్రాజెక్టు కమిటీలు ఉన్నాయి. ఈ ప్రక్రియ 40 రోజుల పాటు కొనసాగుతుంది. పంట కాలువల అభివృద్ధి, నీటి సరఫరా తీరుతెన్నులు పర్యవేక్షణతో పాటు ఆయకట్టు సమస్యల పరిష్కారం కోసం సాగునీటి సంఘాలు పనిచేసేవి. 2015లో టీడీపీ ప్రభుత్వం ఈ సంఘాలకు ఎన్నికలు నిర్వహించింది. ఆ పార్టీకి చెందిన నేతలు నీరు–చెట్టు ఇతర నిధులతో తమ ఇష్టానుసారంగా పనులు చేసి భోంచేశారు. ఈ కమిటీలతో రైతులకు పెద్దగా ఏమీ ప్రయోజనం లేకుండాపోయింది. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికల్లో రాజకీయ ప్రమేయం ఉండకూడదనే ఉద్దేశంతో ఎన్నికలు నిర్వహించలేదు. చెరువులు, కాలవల అభివృద్ధికి నిధులు కేటాయించి స్థానికంగా ఉండే రైతులచే పనులు చేయించారు. కూటమి ప్రభుత్వం మరల పాత విధానంలో సాగునీటి సంఘాల పేరుతో తమ అనుచరులను ఎంపిక చేసి నిధుల దోపిడీకి సైరన్ మోగించింది.

మోత మోగుతున్న టపాసుల ధరలు

కావలి: దీపావళి పండుగకు ప్రతి ఇంట్లో ఏదో ఒక బాణసంచా మోత వినిపిస్తుంది. జిల్లాలో వీటి వ్యాపారం ఏటా రూ.కోట్లలో జరుగుతుంది. జిల్లాలో 90 లైసెన్స్ దుకాణాలు ఉండగా వాటిలో అత్యధికంగా నెల్లూరు, కావలి ప్రాంతాల్లో ఉన్నాయి. అలాగే 20 టపాసులు నిల్వ చేసే గోదాములకు అనుమతులు ఉన్నాయి. ఇవి కాకుండా పండుగ మూడు రోజులు తాత్కాలిక లైసెన్స్ పొంది ఏర్పాటు చేసే దుకాణాల సంఖ్య కూడా ఎక్కువగా ఉంటుంది. అమ్మకాలు చేస్తున్న హోల్‌సేల్ దుకాణాల్లోనే బాణసంచా సరుకులు చుక్కలనంటాయి. టపాసుల ధరలు పేలిపోతున్నాయి. గతేడాదితో పోలిస్తే హోల్‌సేల్ దుకాణాల్లోనే అన్ని ధరలు 20 నుంచి 30 శాతం వరకు పెరిగాయి. లేబర్, ట్రాన్స్‌పోర్టు, పన్నులు, దుకాణ అద్దెలు, కెమికల్స్ ధరల పెరుగుదల టపాసులపై పడిందని, అందుకే ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. దీపావళిలో ఎక్కువగా పిల్లలు ఇష్టపడి కాల్చే కాకర పువ్వొత్తులు సాదా బాక్స్ ధర మంచి కంపెనీ అయితే రూ.90 నుంచి రూ.110 ఉంది. గత ఏడాది రూ.60 నుంచి రూ.70 ఉండేది. చిచ్చుబుడ్లు పెద్దవి మంచి కంపెనీవి బాక్స్ రూ.300 వరకు పలుకుతుంది. భూ చక్రాలు గతేడాది రూ.70 నుంచి రూ.80 ఉండేది. ఇప్పుడు రూ.100 నుంచి రూ.120 దాకా ఉంది. ఈ నెల 31వ తేదీ దీపావళి పండగ కావడంతో, తాత్కాలిక లైసెన్స్‌లతో దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి వ్యాపారులు సన్నాహాలు చేసుకుంటున్నారు.